క్లుప్తంగా

బహుజన రాజ్యాధికారమే బీఎల్‌ఎఫ్ లక్ష్యం



ఖలీల్‌వాడి: బహుజన ప్రజలకు రాజ్యాధికారం అందించడమే బీఎల్‌ఎఫ్ లక్ష్యమని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సబ్బని లత పేర్కొన్నారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో బుధవారం బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్‌ఎఫ్) ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బీడీ కార్మికులకు జీవన భృతి ఇస్తామని హామీ ఇచ్చి కేసీఆర్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం కోసం పోరాడుతున్న బీఎల్‌ఎఫ్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. నాయకులు మధు, గీతాంజలి, దండు జ్యోతి, జగదీష్, గంగాధర్ గైక్వాడ్, కుమార్, రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి



సిరికొండ: జిల్లా గోసంగి సంఘం కమిటీ వారు ఎమ్మెల్సీ కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు విన్నవించారు. ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్, ఉపాధ్యక్షుడు సురేష్, రాజు, మోహన్, శంకర్, నడ్పి నర్సయ్య, సత్తయ్య, రామస్వామి, అజయ్ పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



నిజామాబాద్ రూరల్: అన్నదాతలు వ్యవసాయ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ సహకార సంఘ చైర్మన్ శేఖర్‌రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సంఘంలో చైర్మన్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 25 మంది రైతులకు రూ.24లక్షల రెండు వేల రుణాలను అందిచారు. ఈ కార్యక్రమంలో వైస్ చెర్మన్ కొట్టల రవీందర్, సీఈవో విష్ణువర్ధన్, రైతులు పాల్గొన్నారు.

'బీఎస్పీలో బీసీలకు 70 సీట్లు'

నిజామాబాద్‌నాగారం: బడుగు, బలహీన వర్గాలకు బీఎస్పీ అండగా ఉండి ఓట్లు మావే.. సీట్లు మావే అనే నినాదంతో 70 సీట్లు బీసీలకు కేటాయిస్తుందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ బడుగు, బలహీన వర్గాలను మభ్యపెడుతూ కోట్లాది రూపాలయు దోచుకుందని ఆరోపించారు. జిల్లాలోని ప్రతి నియోజక వర్గంలో బీఎస్పీ పోటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి గంగాధర్, జ్యోతి, గంగాధర్, కృష్ణయాదవ్, రాజన్న, సమీ, కృష్ణ పాల్గొన్నారు.

17న మండల సమావేశం

మోపాల్: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈనెల 17న మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లింగం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లతా కన్నీరాం అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నామని, సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

మద్యం పట్టివేత

ఖలీల్ వాడి : నగరంలోని ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రినగర్ లో బెల్ట్ షాపులో మద్యం అమ్ముతున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. లిక్కర్, బీర్లు అమ్మకాలు చేపట్టిన నాగరాజుపై కేసు నమోదు చేశామన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

నవీపేట: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. జెడ్పీటీసీ నీరడి సవితతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు గైర్హాజరవడంతో సమస్యల ప్రస్తావన నామమాత్రంగా జరిగింది. దీనికి తోడు వివిధ శాఖల అధికారులు కూడా హాజరవలేదు. దీంతో వచ్చిన వారు కొన్ని శాఖలపై తూతూ మంత్రంగా సమీక్ష నిర్వహించారు. పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. వైస్ ఎంపీపీ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు అండగా ఉంటా

- అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా
- నగరంలో గంగపుత్ర సంఘం ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా

నిజామాబాద్‌నాగారం: నగరంలో గంగపుత్రుల సమస్యలను పరిష్కరిస్తూ, వారికి అండగా ఉంటున్నానని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జనార్దన్ గార్డెన్స్‌లో బుధవారం గంగపుత్ర సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపట్టిన అనేక కార్యక్రమాల ద్వారా మత్స్య సంపద గణనీయంగా పెరిగిందన్నారు. ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తూ, సబ్సిడీల్లో వాహనాలు అందించి ప్రభుత్వం గంగపుత్రులకు ఆర్థికంగా అండగా ఉంటుందన్నారు. నగరంలో చేపల మార్కెట్ నిర్మాణంలో ఉందని, అందుబాటులోకి వస్తే మత్స్యకారులకి ఉపాధి లభించడంతో పాటు, నగర ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అహ్మది బజార్ మార్కెట్‌లో చేపల విక్రయ కేంద్రం ఏర్పాటు చేసి గంగపుత్రులకు ఉపాధి కల్పించాలని నిర్ణయించామన్నారు. మరోసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధిలో హైదరాబాద్ తరువాత స్థానం నిజామాబాద్ ఉండేలా కృషి చేస్తానని మాటిస్తున్నానన్నారు. మేయర్ నీతూకిరణ్, నూడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, దండు శేఖర్, సిర్ప రాజు, గంగపుత్ర సంఘ నాయకులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఖిల్లా ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఖిల్లా చౌరస్తాలో బుధవారం అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పర్యటించి, స్థానిక మహిళలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాలనాడు జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు నివాసం వద్ద ఎమ్మెల్యే, స్థానిక ప్రజలతో కలసి అల్పాహారం చేశారు. మేయర్ నీతూకిరణ్, దండు శేఖర్, కార్పొరేటర్ బట్టు రాఘవేందర్, నాయకులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల జీవితాల్లో ఉపాధి వెలుగులు..

నిజామాబాద్‌నాగారం: చేనేత కార్మికులకు గతంలో ఆత్మహత్యలే ఉండేవని, ఇప్పుడు బతుకమ్మ చీరల తయారీతో చేనేత కార్మికుల జీవితాల్లో ఉపాధి వెలుగులు నిండుతున్నాయని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. నగరంలోని విజయలక్ష్మీ గార్డెన్స్‌లో బుధవారం రాత్రి పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. నగరంలో కుల మతాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. నాయకులు గుజ్జెటి వెంకట నర్సయ్య, ఏనుగందుల మురళి, సత్యపాల్, పుల్గం హనుమాండ్లు, దీకొండ యాదగిరి, మహేష్, గుడ్ల భూమేశ్వర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పద్మశాలీలు

వైశ్య కార్పొరేషన్ తేలేని అసమర్థ ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని 9 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని, వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయలేని అసమర్థ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. నగరంలోని నిఖిల్‌సాయి హోటల్‌లో బుధవారం ఆర్యవైశ్య, ధన్‌పాల్ సూరన్న సేన ఆధ్వర్యంలో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల ప్రతి కష్టంలో భాగస్వామిని అయ్యాయని తెలిపారు. తన ట్రస్ట్ ద్వారా అనేక సంఘాలకు సేవా కార్యక్రమాలు చేశానని గుర్తుచేశారు. తాను ఏనాడూ కుల సంఘం సమావేశాల్లో రాజకీయాలు మాట్లాడలేదని, ఎవరో మాట్లాడితే పట్టించుకోబోనని, రాజకీయంగానే ఎదుర్కొంటానని స్పష్టంచేశారు. నిజామాబాద్ అర్బన్ అభివృద్ధిపై తాను అర్బన్ ఎమ్మెల్యేను శ్వేతపత్రం విడుదల చేయాలని కోరినా.. స్పందించలేదన్నారు. బీజేపీ ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని తెలిపారు. భవిష్యత్‌లో రాజకీయాల ద్వారా ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని, ఆర్యవైశ్య సోదరులకు అండగా నిలుస్తానని పేర్కొన్నారు. సంఘ ప్రతినిధులు మూడ నాగభూషణంగుప్తా, నాయకులు ఉప్పలంచ భూమాలింగం, ఇల్లెందుల ప్రభాకర్, పెండ్యాల వాసు, పాల్దె లక్ష్మీకాంతం, లాఖిశెట్టి శ్రీనివాస్, మోటూరి మురళీ, డాక్టర్ వెంకటరమణ, చిట్టిమిల్ల హరిప్రసాద్, పురుషోత్తం, అశోక్, కార్పొరేటర్ మమత, ధన్‌పాల్ శ్రీనివాస్, చందూరు ధర్మేందర్, ధనలక్ష్మి, బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

ఎన్నికల నిబంధనలు పక్కాగా పాటించాలి

డిచ్‌పల్లి: రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని నిజామాబాద్ డీఎల్‌పీవో నాగరాజు తెలిపారు. డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ.. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నియామళి ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీ పరిధిలో బిల్లులు 100 శాతం చెల్లించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు విద్యుత్‌ను పొదుపు చేసి బిల్లులు తక్కువ వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. పన్నులు సకాలంలో వసూలు చేయాలని సూచించారు. ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, జీపీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

బీసీలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

ఖలీల్‌వాడి: రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ బీసీలను పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజనరేందర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు చెందిన షాపులకు ఉచిత విద్యుత్ తోపాటు మాడరన్ సెలూన్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పి, ఇంతవరకు అమలు చేయలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బీసీలను పట్టించుకోలేదని ఎన్నికల కోసమే బీసీలను ఆత్మీయ సమ్మేళనంతో ఓటు బ్యాంకుగా వాడుకున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బీసీలు బుద్ధిచెబుతారన్నారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విక్కీ యాదవ్, గంగాధర్‌గౌడ్, ఆర్మూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, నవీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

ఖలీల్‌వాడి: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నిజామాబాద్ నగర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం బోర్గాం (పి) శివారులోని ప్రభుత్వ భూములను ఆక్రమించి, ముళ్లపొదలను చదునుచేసి ఎర్రజెండాలు పాతారు. ఈసందర్భంగా డివిజన్ కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ.. నగరంలోని 5వ డివిజన్ బోర్గాం, ఆర్యనగర్, మహాలక్ష్మి నగర్, వినాయక్ నగర్ కాలనీలోని వందలాదిమంది నిరుపేదలు ఇళ్ల స్థలాల కోసం ఏళ్లుగా పాలకులకు విన్నవిస్తున్నారన్నారు. అయినప్పటికీ స్పందన లేకపోవడం దుర్మార్గమన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాలను నివారించి, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. నాయకులు సాయగౌడ్, నగర కార్యదర్శి సుధాకర్, ముత్యాల నారాయణ, లక్ష్మి, గంగమల్లు, గణేష్, అషర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) నాయకులు

షుగర్ ఫ్యాక్టరీని తెరిపించే వారికే మద్దతు



నిజామాబాద్‌రూరల్: సారంగాపూర్ చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని హామీ ఇచ్చే వారికే ఎన్నికల్లో తమ మద్దతు ఇస్తామని సారంగాపూర్ చక్కెర కర్మాగార పరిరక్షణ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలో బుధవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిటీ చైర్మన్ కొండెల సాయిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చక్కెర కర్మాగారం రైతులకు అప్పగించాలని సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళిసైకి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో కర్మాగారాన్ని రైతులకు అప్పగించాలన్నారు. డైరక్టర్లు సాయిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటరెడ్డి, సూర్యరెడ్డి, రాధకిషన్‌గౌడ్, కదం పెంటాజీ, బాగరెడ్డి, ఇంజనీర్ భూమేశ్వర్, అకౌంట్స్ ఆఫీసర్ అనిల్‌రావు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సిర్‌పూర్‌లో బెల్టుషాపుపై దాడి

మోపాల్: మండలంలోని సిర్‌పూర్‌లో అక్రమంగా కొనసాగుతున్న బెల్టుషాపుపై బుధవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఈసందర్భంగా వారు 3 బీర్ కాటన్లు, 50కిపైన క్వార్టర్‌లను పట్టుకున్నారు. సుమారు రూ.13500 విలువైన మద్యాన్ని సీజ్ చేసి. ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. ఎన్నికల కోడ్ ప్రకారం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై గంగాధర్ హెచ్చరించారు.

అధ్యాపకులకు సన్మానం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌యూఐ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరితో పాటు అధ్యాపకులకు సన్మానం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌యూ అధ్యక్షుడు శ్రీశైలం, ఉపాధ్యక్షులు అభినయ్, కార్యదర్శి రాజేందర్, అనిల్ కుమార్, విజయకుమార్, రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ త్రివేణిని సత్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌యూఐ నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె వాయిదా



విద్యా శాఖ ఏడీకి లేఖ అందజేస్తున్న నాయకులు

ఖలీల్‌వాడి: మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెను వాయిదా వేస్తున్నామని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్, అధ్యక్షురాలు చామంతి లక్ష్మి తెలిపారు. బుధవారం సమ్మె వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ ఏడీకి లేఖ అందజేశారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,100	వెండి (కిలో)	74,000
22 క్యారెట్స్	55,415	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	35	60
జీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	17	30
జిర్నుకాయ	50	75	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	60	గోబిపువ్వు	40	60
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	40	60	కరివేపాకు	40	60
మెంతికూర	70	90	చామగడ్డ	40	60
కొత్తిమీర	70	90	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	70	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	40	60			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 మ్యాడ్-2023-(తెలుగు)-10.35, 10.30 : స్కంద(తెలుగు)-1.20,7.25 జవాన్(హిందీ)-4.20

స్క్రీన్-2 చిన్న(తెలుగు)-10.40,4.30 మ్యాడ్-2023(తెలుగు)-1.40 జవాన్(హిందీ)- 7.20 మిషిన్ రాణిగంజ్(హిందీ)-10.30

స్క్రీన్-3 చిన్న(తెలుగు)-1.30,7.45, 10.30 మామా మశ్చీంద్ర(తెలుగు)- 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 మిషిన్‌రాణిగంజ్(హిందీ)-10.00, 10.25 మామా మశ్చీంద్ర(తెలుగు)-1.00 మ్యాడ్(తెలుగు)-4.10 జవాన్(హిందీ)- 7.00

స్క్రీన్-2 ది క్వార్సిస్ట్(ఇంగ్లీష్)-1.00 స్కంద(తెలుగు)- 3.35 మ్యాడ్(తెలుగు)-7.05 చిన్న(తెలుగు)-10.15

స్క్రీన్-3 ది క్వార్సిస్ట్(ఇంగ్లీష్)-10.35 చిన్న(తెలుగు)-1.10 మిషిన్ రాణిగంజ్(హిందీ)-4.10 రూల్స్ రంజన్(తెలుగు)-7.10, 10.30

స్క్రీన్-4 రూల్స్ రంజన్(తెలుగు)-10.00 800(తెలుగు)-1.20 మంత్ ఆఫ్ మధు(తెలుగు)-4.40 ది క్వార్సిస్ట్(ఇంగ్లీష్)-7.40 స్కంద(తెలుగు)-10.15

దేవి మ్యాడ్ (తెలుగు)-11.15,2.15 రూల్స్ రంజన్(తెలుగు)-6.00,9.15

నటరాజ్ చిన్న (తెలుగు)

లలితామహల్ మామా మశ్చీంద్ర(తెలుగు)- 11.15 , 6.15 చంద్రముఖి-02 (తెలుగు)-2.15, 9.15

విజయ్ స్కంద (తెలుగు)

సంక్షిప్తం

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక




డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని సన్నిధి జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 15 నుంచి 19వరకు చత్తీస్‌ఘడ్‌లో జరగబోయే జాతీయ పోటీలలో సన్నిధి పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

సౌత్‌జోన్ జాతీయ హాకీ టోర్నీకి ఎంపిక

సిరికొండ: సౌత్ జోన్ జాతీయస్థాయి హాకీ టోర్నీకి తూంపల్లికి చెందిన క్రీడాకారుడు విశాల్ ఎంపికైనట్లు జెడ్పీహెచ్‌ఎస్ పీఈటీ, కోచ్ నాగేష్ బుధవారం తెలిపారు. హైద్రాబాద్‌లో గత నెలలో నిర్వహించిన ఎంపిక పోటీలలో ప్రతిభ కనబర్చి విశాల్ జాతీయస్థాయి టోర్నీకి ఎంపికయ్యాడని తెలిపారు. తమిళనాడులో ఈ నెల 17 నుంచి జిగిగే పోటీల్లో విశాల్ పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా క్రీడాకారుడిని సర్పంచ్ పల్లె బాలమణిమల్లేష్, ఎంపీటీసీ లింగం, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణ, విద్యాసాగర్‌రెడ్డి, సురేందర్ అభినందించారు.

కిశోర బాలికలకు అవగాహన



సిరికొండ: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని సిరికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ ప్రియదర్శిని మాట్లాడుతూ..కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండటానికి ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాలల హక్కుల గురించి వివరించారు.అంగన్‌వాడీ టీచర్ పద్మావతి తదితరులున్నారు.

కులమతాలకు అతీతంగా ఓట్లు వేయాలి

నిజామాబాద్‌నాగారం: ప్రజలకు కులమతాలకు అతీతంగా ఓట్లు వేయాలని ప్రకాష్ అంబేడ్కర్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఇత్వార్‌పేట్ లింగన్న తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాల నుంచి పలువురు అనవాయితీగా ఓట్లు వేస్తామని బాండ్ పేపర్లు రాసివ్వడం సరికాదన్నారు. మీ పార్టీకే ఓట్లు వేస్తామంటూ బాండ్ పేపర్లు రాసివొద్దని అన్నారు. అలా చేస్తే ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు దయానంద్, జిల్లా కార్యదర్శి మేరజ్, ఉపాధ్యక్షుడు విజయ్ పాల్గొన్నారు.

క్రీడారంగం అభివృద్ధికి కృషి...



నిజామాబాద్‌నాగారం: క్రీడారంగం అభివృద్ధికి కృషి చేస్తామని నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ పట్టణ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గం, పట్టణ ప్రైవేట్ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు బుధవారం జిల్లా ఒలిపిక అసోసియేషన్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డిని కలిసి సన్మానించారు. ఈసందర్భంగా నుడా చైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాలో ఒలింపిక్ భవనం, పేట భవన్ నిర్మిస్తామన్నారు. సంఘ ప్రతినిధులు అజ్మత్ ఖాన్, ప్రశాంత్, గంగ మురళి పాల్గొన్నారు.

మురళీధరన్‌ను కలిసిన మాజీ మేయర్



ఖలీల్‌వాడి: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్‌ను బుధవారం నిజామాబాద్ తొలి మేయర్, కాంగ్రెస్ నాయకుడు ధర్మపురి సంజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు పలు విషయాలపై చర్చించినట్లు తెలిసింది.

నూతన కార్యవర్గం ఎన్నిక



మోపాల్: మోపాల్ మండల రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్‌రెడ్డి (సిర్‌పూర్), ప్రధానకార్యదర్శిగా సుధాకర్‌రెడ్డి (కంజర్), కోశాధికారిగా శ్రీకాంత్‌రెడ్డి (సింగంపల్లి), ఉపాధ్యక్షులుగా రవీందర్‌రెడ్డి, భూపతిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రశాంత్ రెడ్డి, లింబారెడ్డి, సహాయ కార్యదర్శిగా నరేష్‌రెడ్డి, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రూ.2వేల కోట్లతో చట్టబద్ధతతో కూడిన రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసేవరకూ పార్టీలకతీతంగా ఉద్యమిస్తామన్నారు.

పౌల్ట్రీఫాం సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఎంఎస్‌సీ ఫారం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన పౌల్ట్రీ ఫాం సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎడపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. పౌల్ట్రీఫాం ఏర్పాటుతో దుర్గంధం వెదజల్లుతోందని, గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా భరించలేకపోతున్నారన్నారు. వివాదాస్పద భూమిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన పౌల్ట్రీఫాంపై చర్యలు చేపట్టేవరకు పోరాటం చేస్తామన్నారు. నాయకులు శ్రీధర్, సజన్, రాము, యోగి, సుదర్శన్, ప్రకాశ్, సాయి పాల్గొన్నారు.